క్లుప్తంగా

ముగిసిన ఉరుసు ఉత్సవాలు



రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం పాతరాయచోటిలో వెలసియున్న హజరత్ జమాలుల్లా బాబా ఉరుసు ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉరుసు సందర్భంగా గత మూడు రోజులుగా పలు కార్యక్రమాలను నిర్వాహకులు నిర్వహించారు. శనివారం తహలీల్ ఫతేహా కార్యక్రమంతో వైభవంగా ముగిసింది. హిందూ, మహమ్మదీయ సోదరులు పెద్ద ఎత్తున ఉరుసు ఉత్సవాలలో పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యులు

పుల్లంపేట : అప్పారాజుపేట గ్రామంలో తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వంద మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా అందజేశారు. అప్పారాజుపేట ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్థో, యూరాలజీ, న్యూరో, జనరల్ సర్జన్, ఊపిరితిత్తులు, ఈఎన్‌టీ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సన్మానం

సిద్దవటం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఐసీడీఎస్ భాకరాపేట సెక్టారులో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం హ్యాపీ కిడ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ అనిల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరవై మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ జొన్నాదుల శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాడు.. పింఛన్ అందించాడు



పింఛన్ అందిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండల వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట ఇచ్చిన ప్రకారం తన స్వంత నిధులతో కోడూరు వెంటయ్యకి నెలవారీ పింఛన్ రూ.5వేలును శనివారం డీవీ రమణ ద్వారా అందచేయించారు. అరుంధతివాడకు చెందిన వెంకటయ్యకు ఏడాది క్రితం ఒక కాలు తీసేశారు. గతంలో పరామర్శించిన ధ్వజారెడ్డి ప్రభుత్వ పింఛన్ వచ్చేవరకు ప్రతి నెలా రూ.5వేలు అందిస్తామని తెలిపారు. కష్టాలలో ఉన్న తనను ఆదుకొన్నందుకు బాధితుడు వైస్ ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో కోడూరు ప్రసాద్, గిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందాలి



ఆలయంలో గడికోట మోహన్ రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దిన్నెపాడు కస్బాలో కొలువైన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి మోహన్ రెడ్డి హాజరై పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దిన్నెపాడు ఎంపీటీసీ సుబ్బరాయుడు, వెంకటరమణ ఆచారి, రామాంజులు, భక్తులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయండి

పెనగలూరు : మండలంలోని గ్రామాలలో గ్రీన్ అంబాసిడర్‌లు తడి, పొడి చెత్తను వేరు చేయాలని ఎంపీడీఓ విజయారావు అన్నారు. శనివారం ఉదయం చెత్తను సేకరిస్తున్న అంబాసిడర్లు వద్దకు వెళ్లి ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇంటి వద్ద నుంచి చెత్తను చేర్చే వారితోనే తడి, పొడి చెత్తను వేరు చేసి తీసుకువచ్చే విధంగా చర్యలను చేపట్టాలని తెలియజేశారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిరోజూ చెత్తను సేకరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

గర్భిణీ మహిళకు రక్తదానం

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీ మహిళకు రక్తదానం చేసినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ డాక్టర్ మైనుద్దీన్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి ఆరోగ్యం బాగాలేక అడ్మిట్ అయిన మహిళకు రక్తం తక్కువగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటనే గర్భిణీ బంధువులు తమను సంప్రదించగా గణేష్ అనే యువకుడిచే ఏ పాజిటివ్ రక్తదానం చేయించినట్లు మైనుద్దీన్ తెలిపారు.

ధరలేక.. దిక్కుతోచక!

పాల సేకరణకు బొప్పాయి తోటలు

- దళారీల సిండికేటుతో మోసపోతున్న కోడూరు రైతాంగం
- చివరి దశలో టూటీ – ఫ్రూటీ, పాల సేకరణకు ఇస్తూ ఊరట
- గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వానికి విన్నపం



మండలంలో సాగులో ఉన్న బొప్పాయి

రైల్వేకోడూరు అర్బన్ : బొప్పాయి పంటను సాగు చేసే రైతులకు బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. కానీ ఈ ఏడాది వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతులకు నష్టాలు తెచ్చిపెట్టినా పంటను పాలకు అమ్మేసి ఎంతో కొంత ఉపశమనం పొందుతున్నారు. ఈ ఏడాది వాతావరణం, వర్షాలు అధికమించి పంట బాగా రావడంతో మంచి లాభాలు వస్తాయని రైతులు ఆశపడినా ధర లేకపోవడంతో డీలా పడ్డారు. సాధారణంగా రెండు కోతల తరువాత పంటను పాలకు ఇస్తారు. అయితే ధరలు, ఎగుమతులు లేకపోవడంతో చాలా మంది రైతులు బొప్పాయి పాలకు తోటను ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. ధరలు బాగా ఉంటే బొప్పాయి పంట మొదటి, రెండవసారి కోతకు లాభాలు వస్తాయి. అలాగే మూడవసారి పంటకోతను బొప్పాయి పాలకు, టూటీ – ఫ్రూటీ తయారీకి ఉపయోగించే బొప్పాయి ఫ్యాక్టరీలకు ఎగుమతి చేయవచ్చు. కోడూరులో బొప్పాయి పాల వ్యాపారంపై పలువురు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చెట్లకు ఉన్న కాయల నుంచి పాలు తీసి వాటిని కిలోల లెక్కన సేకరించి ముంబాయి, హైదరాబాద్, కోయంబత్తూరు, పూణె, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ పాలను, మెడిసిన్ తయారీ, కెమికల్స్ తయారీకి వినియోగిస్తుండటంతో ఇతర ప్రాంతాలలో మంచి గిరాకీ ఏర్పడింది. పంట చివరి దశలో ఉన్నప్పుడు రైతుల నుంచి ఎకరా 15 వేల నుంచి 30 వేల వరకు కొనుగోలు చేయడమే కాక అందులో నైపుణ్యం కలిగిన కూలీలచే చెట్టుకు ఉన్న కాయల నుంచి పాలను తీస్తారు. అనంతరం పాలను క్యాన్‌లలో సేకరించి 50 కేజీలయ్యాక ఎగుమతి చేసుకొని వ్యాపారస్తులు సొమ్ము చేసుకొంటారు. దీనివల్ల రైతులకు బొప్పాయి పంటపై మూడు దశల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రైతు బొప్పాయి పంటను నాటిన దగ్గర నుంచి చివరి దశ వరకు కాపాడుకోగలిగితే నష్టపోకుండా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



బొప్పాయిచెట్టుకు ఉన్న కాయల నుండి పాలు తీస్తున్న కూలీ



టూటీ ఫ్రూటీకి ఉప్పులో నానబెట్టిన ముక్కలు

ఫ్యాక్టరీలకు ఎగుమతి



కోడూరు ప్రాంతంలో బొప్పాయి పంట చివరి దశకు వచ్చాక రైతు నుంచి తోటను తీసుకొని బొప్పాయి కాయల నుంచి పాలు తీసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం. ధరలు పతనమైనప్పుడు తోటలు బాగా దొరుకుతాయి. ప్రస్తుతం అక్కడక్కడా కాయలు ఉండడంతో మంచి గిరాకీ వుంది. పాలను సేకరించి వివిధ ఫ్యాక్టరీలకు ఎగుమతి చేస్తుంటాం.

– ప్రవీణ్, బొప్పాయి పాల వ్యాపారి, రైల్వేకోడూరు

దళారీలదే రాజ్యం



కోడూరు ప్రాంతంలో దళారీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిన్న ఉన్న ధరల ఈ రోజు ఉండడం లేదు. 10 ఎకరాల బొప్పాయి పంటలో టన్ను 6 వేలకు విక్రయిస్తే పెట్టుబడి కూడా రాదు. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. చివరకు పాలకు తోటలోని కాయలను ఇవ్వాల్సి వస్తోంది. ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలి.

– ముద్దులూరు సుబ్బరామరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కేఆర్ కంద్రిక, రైల్వే కోడూరు

సీజన్‌లో పనులు దొరుకుతాయి



మాది ప్రకాశం జిల్లా. పాల సేకరణ పని నిమిత్తం కోడూరుకి వచ్చాను. బొప్పాయి సీజన్‌లో మాత్రమే పనులు దొరుకుతాయి. మిగిలిన రోజుల్లో వేరే పనులు చేసకుంటుంటాం. బొప్పాయి పాల సేకరణ కొన్నేళ్లుగా చేస్తున్నాను. పాల సేకరణలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. కూలీ గిట్టుబాటు అవుతుంది. ఏడాది పొడవునా ఇదే పని ఉంటే బాగుంటుంది.

– గొర్రం పోలయ్య, కూలీ, గుంటవాదంపల్లి, ప్రకాశం జిల్లా

జూదరుల అరెస్టు

సుండుపల్లి : మండల పరిధిలోని చంద్రాజుగారిపల్లె సమీపంలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచిరూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

సుండుపల్లె : ద్విచక్రవాహనం, డీజే సౌండ్ సిస్టంతో ఉన్న బొలెరో వాహనం ఢీకొన్న ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఈదలవంక దగ్గర గురువారం రాత్రి సమయంలో డీజే సౌండ్ సిస్టంతో ఉన్న బొలెరో వాహనం, ద్విచక్రవాహనం ఢీకొనగా ద్విచక్ర వాహనదారుడు దేరంగుల రవితేజ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కుటుంబసభ్యుడు దేరంగుల సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి

పెనగలూరు : ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం నిరంజన్ అన్నారు. శనివారం వెలుగు సిబ్బంది, యానిమేటర్లతో సమావేశాన్ని వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూపుల్లోని ప్రతి ఒక మహిళా ఆర్థిక ఇబ్బందులు లేకుండా స్థిరమైన సంపద పొందాలని సూచించారు. అందుకు అవసరమైన రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాగే బ్యాంకు లింకేజీలపై యానిమేటర్లు, సీసీలు దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే స్త్రీ నిధిపై ప్రత్యేక దృష్టి పెట్టి రుణాలు తీసుకున్న వారితో సమావేశాలు నిర్వహించాలని తెలియజేశారు.

కమీషన్ల కోసమే మెడికల్ కళాశాలలు ప్రైవేటుకు



పల్లె గ్రీష్మంత్‌రెడ్డి

నందలూరు : ఉన్నతమైన ఆలోచనలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మించిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలో వైద్యుల ఆవశ్యకతను గుర్తించిన వైఎస్ జగన్ మెడికల్ కాలేజీలు నిర్మించి రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి బాటలు వేస్తే, చంద్రబాబు ప్రభుత్వం నిర్మాణం పూర్తయిన 10 మెడికల్ కాలేజీలను కమీషన్ల కోసం కక్కుర్తిపడి కారుచౌకగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు వైద్య విద్యను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తాం అని చెప్పిన చంద్రబాబు అది కేవలం ప్రైవేటు, కార్పొరేట్లకు ప్రభుత్వ సొత్తును అప్పగించి వారి ప్రాపకం కోసం పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్ కుమార్

రాజంపేట : ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మూడో అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పోలీసులు, అధికారులు, బ్యాంకు అధికారులు, ఇన్సూరెన్సు కంపెనీ వారితో కోర్టు హాల్‌లో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ అయ్యే కేసుల కక్షిదారులను పిలిపించి పరిష్కరించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కేసుల సామరస్యరీతిలో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక అని చెప్పారు. ప్రజలు జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జడ్జి తెలిపారు. సమావేశంలో పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు, బార్ ప్రెసిడెంటు పి.హనుమత్ నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సేవలో తరించి.. పురస్కారం వరించి



లక్ష్మీకేశమ్మ, హెచ్‌ఎం, సిద్దవటం



గోపినాథ్, స్కూలు అసిస్టెంట్, ఒంటిమిట్ట



శివరామకృష్ణంరాజు, ఎస్‌జీటీ, ఒంటిమిట్ట



సౌభాగ్యలక్ష్మీదేవి, ఎస్‌జీటీ, ఒంటిమిట్ట



ప్రభు భూషణ, ఎస్‌జీటీ, ఒంటిమిట్ట

ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు పురస్కారం అందజేశారు. వైఎస్సార్ జిల్లాలో 64 మంది గురువులను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన వారు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరికి గురుపూజోత్సవ వేడుకలను పురస్కరించుకుని కడపలోని కలెక్టరేట్ సభాభవన్‌లో అవార్డు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. – సిద్దవటం, ఒంటిమిట్ట

ప్రిన్సిపల్ రమేష్‌కు సత్కారం



ప్రిన్సిపల్ రమేష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లి : ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వరాల రమేష్ ఉత్తమ ప్రిన్సిపల్‌గా, ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఉత్తమ టీచర్‌గా ఎంపికై, సెప్టెంబర్ 5న కలెక్టర్, మంత్రి, డీఈఓల చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం వారిని స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఫలితాలు సాధించడంలో, విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి చేసిన చర్యలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : అంధకారంలోకి వెళ్తున్న రాజ్యాంగాన్ని కాపాడాలని భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు శనివారం కొర్లకుంట గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై సుంకాలు పెంపును వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టడం జరిగిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని, ఏటా సుమారు 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి మన రాష్ట్రం నుంచే జరుగుతున్నాయని చెప్పారు. ధరలు పడిపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నారన్నారు. అమెరికా పెత్తందార్లు మన దేశాన్ని అవమానపరుస్తూ ప్రకటనలు చేస్తున్నా మోడీ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. మన దేశ ప్రయోజనాలు, సార్వభౌమత్వ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, రైల్వేకోడూరు కార్యదర్శి ఎం.శివయ్య, సీపీఐ నాయకులు సుబ్బమ్మ, శివయ్య, రమణ, శంకర్, పెంచలయ్య, శంకరయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు ఘన స్వాగతం

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌కు రైల్వేకోడూరులో కూటమి నాయకులు శనివారం స్వాగతం పలికారు. స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.

ఆంజనేయస్వామికి మంత్రి పూజలు

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న అభయాంజనేయస్వామికి మంత్రి సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంత్రి సత్యకుమార్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

సరికొత్తగా.. సమస్యలను తెలియజేద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్

రాయచోటి టౌన్ : ఉద్యోగ సంఘాల నాయకుల్లారా రండి టీ తాగుతూ చర్చించుకుందామంటూ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో భూగర్భ జలశాఖ అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పీఆర్‌సీ, అరియర్, డీఏ అరియర్‌లతో పాటు సరెండర్ లీవ్స్ బిల్లులు పెండింగ్‌లో పెట్టారన్నారు. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు రూ.25 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రభుత్వం బకాయిలు ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలపై ఆలోచించి త్వరగా చెల్లించే విధంగా పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు. కార్యక్రమంలో ఒ.సాయి కుమార్, సుజిత్ దాల్, భూగర్భశాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నైపుణ్యం సాధించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నంత మాత్రాన సరిపోదని కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నైపుణ్యాలు మెరుగుపరిస్తే విజయం తథ్యమని ప్రముఖ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ ట్రైనర్ ఎ.రామేశ్వర్‌గౌడ్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్ అంశాలపై కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కరోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ నేటి పోటీ వాతావరణంలో విద్యార్థులు విజయాన్ని సాధించాలంటే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ అత్యంత అవసరమని తెలిపారు.

ముగిసిన నిమజ్జనోత్సవం



రాయచోటి టౌన్: నిమజ్జనానికి రవిహోల్ ప్రాంత వినాయకుడు

వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. 11 రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. శనివారం రాయచోటితోపాటు ఇతర ప్రాంతాల్లో గణేశుడిని వాహనాల్లో కొలువుదీర్చి డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్ నడుమ వసంతాలు చల్లుకుంటూ.. బాణసంచాలు కాలుస్తూ యువత, మహిళలు, చిన్నారులు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాయచోటి టౌన్: కోలాహలంగా మదనపల్లె రోడ్డులోని వినాయకుడి నిమజ్జనోత్సవం



రాయచోటి జగదాంబ సెంటర్: పట్టణంలో ఊరేగింపుగా వెళ్తున్న భారీ గణనాథుడు



రాయచోటి టౌన్: కొత్తపేటలో ఊరేగింపులో పాల్గొన్న యువకులు



సిద్దవటం: గాంధీ వీధిలో కోలాట భజనలు చేస్తున్న కళాకారులు